క్లుప్తంగా

వాజ్‌పేయ్ ప్రతిమ ఏర్పాటు చేస్తాం

కర్నూలు(టౌన్): నగరంలో మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయ్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని భారతీయ జనతా పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ యస్. రంగస్వామి కోరారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులు సుధాకర్, శ్రీనాథ్ వర్మ, మధుసూదన్‌గౌడ్, హరిప్రసాద్, గోవింద్, కాళింగి నరసింహవర్మ తదితరులతో కలిసి నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజకు వినతిపత్రం అందజేశారు.

12న సీపీఎం సదస్సు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగం సంక్షోభం–ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై అక్టోబర్ 12వ తేదీన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సెంట్రల్ యూనివర్సిటీ(హైదరాబాద్) ప్రొఫెసర్ ఎన్. పురేంద్ర ప్రసాదు హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని మేధావులు, రైతులు పెద్ద ఎత్తున సదస్సుకు హాజరు కావాలని ఆయన కోరారు.

15 నుంచి విజయ దశమి వేడుకలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు విజయ దశమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. అమ్మవారిని రోజుకొక అలంకారంతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

కల్లూరు ఏఓపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి ఆమె చాంబరులో ఏఓ అక్రమాలపై వినతిపత్రం ఇచ్చారు. కొందరు విత్తన వ్యాపారులతో కలిసి నకిలీలను రైతులకు అంటగట్టడంలో ఏఓ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అనంతరం వ్యవసాయాధికారి వరలక్ష్మి, డీఆర్వో కె.మధుసూదనరావుకు కూడా ఆయన వినతిపత్రాలు అందజేశారు.

బోటు నిర్వాహకులపై కేసు నమోదు

పగిడ్యాల: ప్రభుత్వ అనుమతి లేకుండా కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో మూర్వకొండ ఘాట్ నుంచి తెలంగాణ రాష్ట్రం మంచాలకట్టకు ఇంజిన్ బోటు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున మంగళవారం తెలిపారు. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన గొడుగు వెంకట్రాముడు, కావలి వెంకటేశ్వర్లు, గొడుగు పక్కీరయ్య కృష్ణా బ్యాక్ వాటర్‌లో ప్రైవేట్ వ్యక్తులను, ఇతర వస్తువులను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నది పరివాహకం వెంట ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంజన్ బోట్లు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొల్లవరం విద్యార్థిని ఎంపిక

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బొల్లవరం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘన్న మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలోని ఎస్పీజీ మైదానంలో జరిగిన అండర్–14 కబడ్డీ సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని శ్రీవల్లి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి నరసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ..

ఆత్మకూరురూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని దీప్తి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శంకర్ మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి 17 సంవత్సరాల లోపు విభాగం యోగా పోటీలు పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దీప్తి పాల్గొనేందుకు అర్హత సాధించిందని తెలిపారు. పాఠశాల హెచ్ఎం షహనాజున్నిస్సా దీప్తిని అభినందించారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



సీఎస్‌ను ఆహ్వానిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణని దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ శాఖలో ప్రక్షాళన!

- పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ చర్యలు
- ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు ఏఈలపై సస్పెన్షన్ వేటు
- కొందరికి మెమోలు.. జీతాల్లో కోత.. క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు
- అధికారులు, సిబ్బందితో ప్రతి రోజు టెలి కాన్ఫరెన్స్‌లు
- వినియోగదారుల సమస్యలపై సమీక్షలు.. పరిష్కారానికి ఆదేశాలు
- ప్రభుత్వ లక్ష్యాలు, రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): డబ్బు ఇవ్వనిదే విద్యుత్‌శాఖలో ఏ పని కాదు. విద్యుత్ కనెక్షన్ మొదలు ప్రతి పనికి మామూళ్లు సమర్పించుకోవాలి. ఇది గతం. ఎస్పీడీసీఎల్ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి చేపట్టిన చర్యలతో ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు గాడిలో పడ్డారు. పనులపై దృష్టి పెట్టారు. ఫిర్యాదులపై వెనువెంటనే స్పందిస్తున్నారు. ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గడప గడపకు మన ప్రభుత్వం, భద్రత, సేవల్లో లోపాల నివారణకై తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. వినియోగదారుల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు వెనువెంటనే ఆదేశాలు జారీ చేయడంతో పాటు పూర్తయ్యే వరకు ఎస్ఈ పరిశీలన చేస్తున్నారు. దీనికి తోడు అధికారులు, ఉద్యోగులతో పాటు కింది స్థాయి సిబ్బందితో ఆయన టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందితో పాటు ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటున్నారు. తగిన కారణలు ఉంటే సస్పెండ్ చేయడం, మెమోలు ఇవ్వడం, జీతాల్లో కోత విధించడం చేయిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత విద్యుత్ కనెక్షన్ల లక్ష్యాన్ని చేరేందుకు 14వేల మంది రైతులకు ఫోన్ కాల్స్ చేయించి సమాచారం ఇచ్చారు. పాలనను పరుగు పెట్టించడంతో కర్నూలు సర్కిల్ (కర్నూలు, నంద్యాల జిల్లాలు) రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి సంస్థ చైర్మన్ సంతోషరావు నుంచి అవార్డు పొందింది.



విద్యుత్ భవన్

సేవలకు అధిక ప్రాధాన్యత

ప్రజలకు సేవలు, ఉద్యోగుల బాధ్యతను గుర్తు చేసేందుకు ఎస్ఈ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, వినియోగదారులు, సంస్థ లక్ష్యలు చేరేందుకు కృషి చేస్తున్నారు. లైన్‌మెన్ మొదలు డీఈఈల వరకు 80 శాతం మంది గతంలో స్థానికంగా ఉండేవారు కాదు. వీరిపై చర్యలకు సిఫార్సు చేయడంతో 95 శాతం మంది అక్కడే ఉంటున్నారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. అధికారులతో పాటు కింది స్థాయి ఉద్యోగులతోనూ నేరుగా మాట్లాడుతున్నారు. టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కనెక్షన్ల మంజూరు, స్పాట్ బిల్లింగ్, మీటర్ల జారీ, బిల్లుల వసూళ్లపై ఇబ్బందులు తొలగిస్తున్నారు. అలాగే ఏఈ మొదలు ఈఈ స్థాయి వరకు ఎవరైనా స్పందించడం లేదని ఎస్ఈకి ఫోన్ చేస్తే వెంటనే సంబంధిత అధికారికి కాన్ఫరెన్స్ లైన్‌లోకి తీసుకుని మాట్లాడిస్తున్నారు.

జవాబుదారీగా ఉండాలి



వినియోగదారులకు సేవలు చేసేందుకే ఉద్యోగం ఇచ్చారు. ప్రజలు చెల్లించిన సొమ్ముతో జీతం పొందుతున్నప్పుడు వారికి జవాబుదారీగా ఉండాలి. ప్రతి ఉద్యోగి అప్పగించిన పని సక్రమంగా చేయాలి. ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనకు కృషి చేయాలి. రైతుల అవసరాలు, ఉచిత విద్యుత్ కనెక్షన్ల మంజూరు, గడప గడప, జగనన్న గృహ నిర్మాణలు ఇలా ఏదైనా సేవల్లో జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బంది పడుతారు. దీనిని ప్రతి ఉద్యోగి గమనించాలి.

–ఎం. ఉమాపతి, కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ.

నిర్లక్ష్యం వహించిన ఇంజనీర్లు, సిబ్బందిపై వేటు

విధుల పట్ల నిర్లక్ష్యం, సేవాలోపం ప్రదర్శించిన అధికారులపై ఎస్ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు పై స్థాయి నుంచి ఒత్తిళ్లు తెచ్చినా వెనకాడ లేదు. ముఖ్యంగా ఆరు నెలల్లో విధుల పట్ల నిర్లక్ష్యం, సేవా లోపం, అందుబాటులో ఉండని కోవెలకుంట్ల, కర్నూలు, మీటర్స్, ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరు రూరల్ ఏఈలు, నంద్యాల జేఏఓ, ఎల్‌డీసీలపై సస్పెన్షన్ వేటు వేశారు. నందికొట్కూరు, ఆళ్లగడ్డ, నంద్యాల రూరల్స్, నందవరం, బనగానపల్లె రూరల్స్ ఏఈలకు చార్జ్ మెమోలిచ్చారు. మరో 12 మంది ఏఈల జీతాల్లో కోతలు పెట్టారు. భద్రతా పాటించని ముగ్గురు సబ్‌స్టేషన్ ఆపరేటర్లను తొలగించారు. మరికొంత మందిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. పని విషయంలో సడలింపు కోరుతూ వివిధ సంఘాలు చేసిన విన్నపాలు, ఒత్తిళ్లను సైతం పట్టించుకోలేదు.

సేవల్లో టాప్.. సీఎండీతో అవార్డు

రైతుల అవసరాలు, సమస్యలు, ప్రభుత్వ పథకాల లక్ష్యాల సాధనతో పాటు సేవల్లో కర్నూలు సర్కిల్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ముఖ్యంగా ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్ల లక్ష్యాన్ని చేరేందుకు విద్యుత్ భవన్‌లో ప్రత్యేక సెల్ పెట్టి 14 వేల మందికి పైగా రైతులకు ఫోన్లు చేసి.. 'మీకు ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరు అయింది. ఇందుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, సామాగ్రి ఏఈ కార్యాలయానికి పంపించాం. సిబ్బంది వచ్చి కనెక్షన్ ఇస్తారు. మీరెవరికీ అదనంగా డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదని' అప్రమత్తం చేశారు. జగనన్న కాలనీలు, జలకళ, టిడ్కో గృహాలకు విద్యుదీకరణ, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం, వేలాడే తీగల ఎత్తు పెంచడం, గడప గడపకు మన ప్రభుత్వం ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలతో సీఎండీ సంతోషరావు బహుమతి అందించారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి

కర్నూలు(సెంట్రల్): ఈక్రాప్ నమోదుకు సంబంధించిన ఈకేవైసీ గడువును నెలాఖరు వరకు పొడిగించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్దేశించిన ప్రకారం మంగళవారం గడువు ముగియడంతో ఈకేవైసీ వేయడానికి ఆన్‌లైన్ సైట్ ఓపెన్ కావడంలేదన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం



చిన్నటేకూరులో మల్లెతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ఉద్యాన రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన రైతు శేఖర్ మల్లెతోటను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 30 మంది రైతులకు మల్లెతోట సాగుకు ప్రోత్సాహం అందించామన్నారు. వారికి తోట నిర్వహణకు ఖర్చులు లభిస్తున్నాయన్నారు. అలాగే ఉపాధి పథకం పేర్ల బోర్డును కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సీఎల్ఆర్సీ కోర్స్ డైరెక్టర్ ఎర్రమల, ఫీల్డ్ అసిస్టెంట్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- మారుమూల పల్లెలకు సైతం మెరుగైన వైద్యం
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. పేదల సంపూర్ణం ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలోని జి.సింగవరం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు వైద్య నిపుణులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య సేవలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యం కారణంగా ఏ ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోకూడదని ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామంలోకే అంబులెన్స్‌లు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. సాధారణంగా ఫ్యామిలీ డాక్టర్ ఆర్థికంగా బలంగా ఉన్న వారికి మాత్రమే ఉంటారని, అయితే, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు సైతం ఈ సదుపాయం కల్పించారన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరు బీపీ, షుగర్‌తో పాటు ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.



మహిళకు కంటి చూపు చెక్ చేస్తున్న ఎమెల్యే

జిల్లా గోరక్షణ మహా సంఘం ట్రస్ట్ బోర్డు నియామకం

కర్నూలు కల్చరల్: జిల్లా గో రక్షణ మహా సంఘం ట్రస్ట్ బోర్డును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా పి.ఆదిమోహన్‌రెడ్డి, పి.శేషయ్య, వి.విజయ భాస్కర్‌రెడ్డి, ఎమ్.శకుంతల, వై. పార్వతమ్మ, జి.ఎమ్.కవిత, ఎమ్.జవహర్‌లాల్ బాబును నియమించారు. వీరిలో ఒకరిని ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ప్రకటిస్తారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారు.

మట్కా బీటర్ అరెస్టు

కర్నూలు : బనగానపల్లె మండలం నందివర్గంకు చెందిన బండెల శాంతరాజ్ అనే మట్కా బీటర్‌ను కర్నూలు మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక నందికొట్కూరు రోడ్డులోని ఒమెగా హాస్పిటల్ సమీపంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో మట్కా చీటీలు రాస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. శాంతరాజ్‌పై కేసు నమోదు చేసి రూ.45 వేలు నగదు, రెండు మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు మూడో పట్టణ సీఐ డి.మురళీధర్‌రెడ్డి తెలిపారు.

12న హుండీ కానుకల లెక్కింపు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని హుండీ కానుకలను ఈనెల 12న లెక్కింపు చేపడుతున్నామని ఈఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఉదయం 8గంటలకు ఈ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. గ్రామ పెద్దలు, పోలీసులు, అధికారుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వ్యవసాయ కళాశాలలో ఖాళీలను భర్తీ చేస్తాం



వేరుశనగ పంట వద్ద పరిశీలిస్తున్న బోర్డు మెంబర్లు

మహానంది: మండల పరిధిలోని ఎంసీ ఫారంలో ఉన్న ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బోర్డుమెంబర్లు కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి, పలు అంశాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆడిటోరియం, బాలికల వసతిగృహాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. దీంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఎన్‌డీఎల్–7, ఎన్‌డీఎల్ఆర్–8 రకాల వరి విత్తనోత్పత్తికి వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రామారావు సూచనల మేరకు పది ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో శనగ విత్తనోత్పత్తికి మరో 20 ఎకరాలు కేటాయిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ నాయక్, ప్రొఫెసర్లు డాక్టర్ మల్లేశ్వరరెడ్డి, వెంకటేష్‌నాయక్, డాక్టర్ ఎంఎస్ రాహుల్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

- జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య శిబిరంలో ప్రజలకు, రోగులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రజలకు కేస్ షీట్, మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకూడదనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. మలేరియా, డెంగీ, బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్, కంటి, గల్ల మొదలగు పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, గ్రామ నాయకులు, వైద్యాధికారులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సమస్యల పరిష్కారానికి కోటి సంతకాలు

కర్నూలు(సెంట్రల్): సామాజిక సమస్యల పరిష్కారం కోసం కోటి సంతకాలు సేకరించి డిసెంబర్ 4వ తేదీన రాష్ట్రపతికి నివేదించనున్నట్లు కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండీ ఆనందబాబు, కేపీ నారాయణ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులు ఎదుర్కొంటున్న దాడులు, దౌర్జన్యాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల పరిష్కారం, అంటరానితనం నిర్మూలన కోసం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కోటి మందితో సంతకాలు తీసుకొని ప్రధానమంత్రి, రాష్ట్రపతిలకు నివేదించనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవస్వామి, జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు సోగరాజు మునయ్య పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న ఎండీ అంజిబాబు

ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని శిక్షించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ గార్డు వడ్డే పద్మ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని సీటీఐయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడ్డేపద్మను వారు మంగళవారం పరామర్శించారు. గత రెండేళ్ల క్రితం టెండర్ దక్కించుకున్న ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ వారు సరైన జీతం ఇవ్వకుండా తక్కువ పీఎఫ్ చెలిస్తూ మోసం చేస్తున్నారన్నారు. తమకు అనుకూలురైన వారిని ఎస్ఐలుగా నియమించుకుని కార్మికులను భయభ్రాంతులకు లోనుచేస్తున్నారని విమర్శించారు. వడ్డే పద్మ ఎలాంటి తప్పు చేయకపోయినా ఎస్ఐలు ఫిరోజ్, రవితేజ వేధించారన్నారు. ఈ అవమానాలను భరించలేక పద్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : బాల్య వివాహాలు ఒక సామాజిక రుగ్మత అని, దీని నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్టేట్ బ్యాంకు కాలనీలోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఆంధ్రప్రదేశ్ బాల్య వివాహ నిరోధక నిబంధనలు–2023పై వార్డు సచివాలయాల్లోని మహిళ–శిశు సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికడితే మాత, శిశు మరణాలు పూర్తిగా తగ్గుతాయన్నారు. దీనిపై మహిళ శిశు సంరక్షణ కార్యదర్శులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సీడీపీఓ అనురాధ, సామాజిక కార్యకర్త ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఖానా ఖజానాకు విశేష స్పందన

నగరంలోని బిర్లాగేట్ వై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన ఖానా–ఖజానాకు నగర ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5, 6, 7 తేదీల్లో ఖానా– ఖజానాలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌కు మంచి ఆదరణ లభించిందన్నారు. బిర్లాగేట్ వద్ద నిరుపయోగంగా ఉన్న ప్రదేశాన్ని రూ.1.83 కోట్లు వెచ్చించి ఆహ్లాదకర వాతవరణం నెలకొల్పామన్నారు. మహానగరాలకే పరిమితమైన ఈట్ స్ట్రీట్‌ను కర్నూలు నగర వాసుల కోసం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. దాదాపు 10 వేల మందికి పైగా ప్రజలు మూడు రోజుల పాటు ఖానా–ఖజానాలో నిర్వహించిన సాంస్కృతిక , మ్యాజిక్, మ్యూజిక్ కార్యక్రమాలను తిలకించారని చెప్పారు. ఈట్‌స్ట్రీట్ వల్ల ప్రత్యక్షంగా ఎంతో మందికి ఉపాధి లభించిందన్నారు. నగర ప్రజలకు సరికొత్త అనుభూతులను అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. త్వరలో నగరంలో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామన్నారు.

నేడు అటవీ శాఖ అధికారులతో సమీక్ష

కర్నూలు కల్చరల్: కర్నూలు సర్కిల్‌లోని అటవీ శాఖ అధికారులతో ఆ శాఖ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ బుధవారం ఉదయం 11 గంటలకు సర్కిల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. కర్నూలు, కడప జిల్లాల టెరిటోరియల్ డీఎఫ్ఓలు, నంద్యాల, కడప జిల్లాల సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓలు సమీక్షలో పాల్గొంటారు.

జెడ్పీ స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

కల్లూరు : అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో కల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుసేన్, మ్యాజిక్ బస్ సంస్థ మేనేజర్ యాసిన్ బాషా, అకడమిక్ ఎడ్యుకేటర్స్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న యువ టూరిజం క్లబ్ సభ్యులు

కర్నూలు కల్చరల్: పర్యాటక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఏపీ పర్యాటక సాంస్కృతిక శాఖ జిల్లా అధికారి విజయ అన్నారు. మంగళవారం సిల్వర్ జూబ్లీ కళాశాల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ సభ్యులు నగర శివారులోని లక్ష్మీ జగన్నాథ గట్టును సందర్శించారు. 'పచ్చదనం పరిశుభ్రత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రతిజ్ఞ చేశారు. జగన్నాథ గట్టులో ఉన్న మెడిసినల్ ప్లాంట్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ డిపార్ట్ మెంట్ హెచ్ఓడీ డాక్టర్ వెంకన్న, అధ్యాపకులు నాగరాజు శెట్టి, బాలరాజు, మీర్ అల్తాఫ్ అహ్మద్, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సైకిలింగ్, రగ్బీ, నెట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది స్కూల్‌గేమ్స్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో మంచి ప్రతిభ చాటితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించవచ్చునన్నారు. కార్యక్రమంలో బి. క్యాంపు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, క్రీడా సంఘాల ప్రతినిధులు చిట్టిబాబు, నాగరత్నమయ్య, వంశీక్రిష్ణ పాల్గొన్నారు.



బాలికల సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య